క్లుప్తంగా

'యుగంధరాచార్య'కు నేతాజీ స్మృతి పురస్కారం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నేతాజీ 128వ జయంతిని పురస్కరించుకుని విద్యారంగంలో విశేష సేవలందిస్తున్న కూరపాటి చంద్రశేఖరరావు ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్యకు ఇండియన్ ఎన్జీఓ అవార్డ్స్ కౌన్సిల్ వేయిల్ ఫౌండేషన్ సంస్థ నేతాజీ స్మృతి పురస్కారం–2025ను ప్రకటించింది. ఈ మేరకు ఫౌండేషన్ చైర్మన్ బెంజమిన్‌షా నుంచి సమాచారం అందినట్లు కూరపాటి పాఠశాల కార్యదర్శి కూరపాటి చంద్రశేఖరరావు తెలిపారు. అవార్డుకు ఎంపికైన యుగంధరాచార్యను ఆయన అభినందించారు. యుగంధరాచార్యకు పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిజేశారు.

400 మందికి అన్నదానం



లబ్బీపేట(విజయవాడతూర్పు): కుర్తాల శ్రీ సిద్ధేశ్వరీ పీఠాధిపతులు జగద్గురు శ్రీ సిద్ధేశ్వరానందభారతి మహాస్వామి వారి 89వ జన్మదిన వేడుకలు గురువారం నగరంలో ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాల్లో జరుగుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా కృష్ణలంక పాత పోస్టాఫీసు రోడ్డులోని శ్రీ సిద్ధేశ్వరీ పీఠ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వామి వారి శిష్య బృందం పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థినికి బహుమతి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మహాకవి గురజాడ అప్పారావు 109వ వర్ధంతి సందర్భంగా గత ఏడాది అక్టోబర్‌లో కర్నూలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, క్లస్టర్ విశ్వవిద్యాలయం, గురజాడ ఫౌండేషన్, ప్రకాశిక అంతర్జాల ప్రతిక సంయుక్తంగా గురజాడ భావస్ఫూర్తి అనే అంశంపై నిర్వహించిన జాతీయ స్థాయి వ్యాసరచన పోటీల్లో తమ కళాశాలలో బీసీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న బి.దుర్గాభవానీ ప్రతిభ చూపిన నగదు బహుమతి గెలుపొందిందని సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. పోటీల విజేతల వివరాలను బుధవారం ప్రకటించి, నగదు పురస్కారం, ప్రశంసాపత్రాలు అందచేశారన్నారు. ప్రతిభ చూపిన దుర్గాభవానిని కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ సి.జంపాలతో పాటుగా అధ్యాపకులు కళాశాల ఆవరణలో గురువారం అభినందించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, పివి సిద్ధార్థ కళాశాల, ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ కళాశాల, నలంద కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేస్తామని శాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లేటి రమేష్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ యుగంధర్ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఇబ్రహీంపట్నం: ఫెర్రీ ఆర్టీసీ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఇంటి యజమాని అరటికట్ల దుర్గాప్రసాద్ తన కుటుంబ సభ్యుల ఆపరేషన్ నిమిత్తం విజయవాడ వైద్యశాలకు వెళ్లాడు. పగటిపూట రెక్కీ నిర్వహించిన వ్యక్తులు రాత్రి వేళ ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో దాచి ఉంచిన 16 కాసుల బంగారం వస్తువులు, రూ.10 వేల నగదును దుండగులు చోరీ చేశారు. ఇంటికి అమర్చిన సీసీ కెమేరాల్లో నలుగురు దొంగలు ఇంట్లోకి ప్రవేశించినట్లు రికార్డు అయింది. క్లూస్ టీమ్ సభ్యులు వేలి ముద్రలు, ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమేరా ఫుటేజీ ఆధారంగా విచారణ చేపట్టారు.

బహుమతుల ప్రదానం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): స్వాతంత్య్ర సమరయోధుల జీవితాలపై విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలు గురువారం నిర్వహించారు. సీబీఎస్ఈ సిలబస్‌కు చెందిన 100 మంది బాలబాలికలు పోటీలో పాల్గొన్నారు. విజేతలకు ప్రధాని మోదీ రచించిన ఎగ్జామ్ వారియర్ బుక్, పార్టిసిఫికేషన్ సర్టిఫికెట్లను రైల్వే డివిజనల్ మెడికల్ అధికారి శ్రీనివాసులు అందజేశారు.

మిస్టరీగా మారిన బైక్ చోరీలు...దహనాలు

- గ్యాంగ్ పనా? లేక లోకల్ దొంగలేనా?
- భవానీపురం స్టేషన్ పరిధిలో పెరిగిన చోరీలు
- అంతంతమాత్రంగానే రికవరీలు



ఈనెల 2వ తేదీ రాత్రి విద్యాధరపురంలో కాలి బూడిదైన బైకులు(ఫైల్)

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 'విద్యాధరపురం సయ్యద్ అప్పలస్వామి క్వారీవీధికి చెందిన శ్రీనివాసరావు తన ఇంటిముందు పార్క్ చేసిన బుల్లెట్ వాహనం గతేడాది డిసెంబర్ 26వ తేదీ రాత్రి అపహరణకు గురైంది...భవానిపురం గుడివాడ రామారావు వీధిలో ఉండే షేక్ నజీర్ స్కూటీకి గతేడాది డిసెంబర్ 13వ తేదీ తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు'.

ఇలా భవానిపురం పోలీసుస్టేషన్ పరిధిలో బైక్ చోరీలు, దహనాలు పెరిగిపోయాయి. 'పనులు ముగించుకొని తిరిగి వచ్చి ఇంటిముందు బైక్ పార్క్ చేశాను. ఉదయాన్నే చూస్తే బైక్ కనిపించడం లేదంటూ వాహనాలు అపహరణకు గురైన పలువురు బాధితులు ఆవేదన చేస్తున్నారు. అదేవిధంగా ఈనెల 3వ తేదీ విద్యాధరపురం కొట్టేటి కోటయ్య వీధిలో ఇళ్ల ముందు పార్క్ చేసిన ఐదు బైక్‌లు దగ్ధం కావడం మిస్టరీగా మారింది.

తీవ్ర ఆందోళనలో బాధితులు..

భవానీపురం పోలీసుస్టేషన్ పరిధిలో బైక్ చోరీలు నిత్యకృత్యంగా మారాయి. నిత్యం ఏదో ఒక మూల బైక్ చోరీలు చోటుచేసుకుంటుండటంతో బాధితులు స్టేషన్‌కు క్యూ కడుతున్నారు. బాధితులు పిర్యాదు చేసిన వెంటనే పోలీసులు కేసు కట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎవరో ఒకరితో పోలీసులకు ఫోన్ చేయించుకుని వెళితే తప్ప కేసు నమోదు చేయడం లేదని పలువురు బాధితులు వాపోతున్నారు. ఇలా చోరీలకు గురైన బైక్‌ల రికవరీ రేటు కూడా చాలా తక్కువగా ఉంది. బైక్ చోరీ చేసి ఏదో ఒక జిల్లాలో పట్టుబడి దొరికితే తప్ప...రికవరీ కావడం లేదు. దీంతో బాధితులు పోలీసుస్టేషన్ చుట్టూ నెలల తరబడి తిరుగుతున్నారు.

గ్యాంగ్ పనా? స్థానిక దొంగలేనా?:

భవానీపురం స్టేషన్ పరిధిలో బైక్ చోరీలకు పాల్పడుతున్నది ఇతర ప్రాంతాలకు చెందిన ఏదైనా గ్యాంగ్‌నా? లేక పాత దొంగలే చోరీలకు పాల్పడుతున్నారా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. భవానిపురం, విద్యాధరపురం, ఊర్మిళానగర్, గొల్లపూడి ప్రాంతాల్లో బైక్‌లు చోరీలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న ప్రాంతాల్లోనే చోరీలు జరుగుతుండడం బయట వారి పనే అన్న అనుమానాలకు బలాన్నిస్తోంది. అయితే కొందరు స్థానికులు బైక్‌లు చోరీ చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తెలిసింది. భవానిపురానికి చెందిన ఓ వ్యక్తి బైక్ చోరీకి గురికాగా ఆ వాహనాన్ని పోలీసులు బాపట్ల వద్ద పట్టుకున్నారు.

పనిచేయని సీసీ కెమెరాలు..

ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో అధికశాతం పనిచేయక అలంకార ప్రాయంగా మారాయి. ముఖ్యంగా ఐదారు నెలల కాలంలో భవానిపురం క్రాంబే రోడ్డు సితార సెంటర్ నుంచి కుమ్మరిపాలెం రోడ్డుకు మధ్య ప్రాంతంలోనే ఈ బైక్ చోరీలు చోటుచేసుకున్నాయి. బాధితులు స్టేషన్‌కు వెళ్లి సీసీ కెమెరాలు పరిశీలించమని కోరితే పోలీసులు అవి పనిచేయడం లేదని సమాధానం ఇస్తుండటం గమనార్హం. ఇకనైనా బైక్ చోరీలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకోవాలని, గట్టి నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నెలరోజులుగా తిరుగుతున్నా..

గతేడాది డిసెంబర్ 26 రాత్రి ఇంటి ముందు బుల్లెట్ పార్క్ చేశాను. మరుసటి రోజు ఉదయం చూస్తే బైక్ కనిపించలేదు. పోలీసులకు పిర్యాదు చేశాను. సీసీ కెమెరాలు పరిశీలించమని కోరగా, అవి పనిచేయడం లేదని తెలిసింది. అప్పటి నుంచి నగరంలోని పార్కింగ్ స్థలాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్, ఇతర ప్రాంతాల్లో వెదుకుతూనే ఉన్నాను. ఎవరు దొంగిలించారో తెలియడం లేదు.

శ్రీనివాసరావు,
బాధితుడు, విద్యాధరపురం

నామమాత్రపు ఫీజుతో పేదలకు వైద్యసేవలు



కస్టమర్‌కు ప్రొటీన్ పౌడర్‌ను ఉచితంగా పంపిణీ చేస్తున్న సుబ్రహ్మణ్యం

భవానీపురం(విజయవాడపశ్చిమ): సామాన్య, పేద ప్రజలకు మంచి వైద్యసేవలు అందించాలన్న ధ్యేయంతో కేవలం రూ.10 నామమాత్రపు ఫీజుతో ఎంబీబీఎస్ డాక్టర్లతో సేవలు అందిస్తున్నామని విద్యాధరపురం సితార సెంటర్‌లోని బెనిఫిట్ మెడికల్ బజార్ అధినేత తాతా వెంకట సుబ్రహ్మణ్యం తెలిపారు. సంస్థ ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం తొలి వంద మంది కస్టమర్లకు వెండి పుష్పాలను ఉచితంగా అందజేశారు. అనంతరం పలువురు వినియోగదారులకు బలవర్ధకమైన ప్రొటీన్ పౌడర్, గ్యాస్ నివారణ టానిక్, మాస్కులను పంపిణీ చేశారు.

దోమల నిలయాలుగా ఖాళీస్థలాలు



చెత్తాచెదారం, ముళ్లచెట్లతో నిండిన కేఎల్‌రావు నగర్‌లోని ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కేఎల్‌రావునగర్ బ్యాంక్ కాలనీలో ఖాళీగా ఉన్న ప్లాట్లలో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ ప్లాట్లలో పెద్దఎత్తున పిచ్చి మొక్కలు, భవన నిర్మాణ వ్యర్థాలు పేరుకోవడంతో విష కీటకాలు చేరుతున్నాయి. మరో వైపున కొన్ని ప్లాట్లలోకి వర్షపునీరు, మురుగునీరు చేరడంతో ఆస్థలాలన్నీ దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. అవుట్ పాల్ డ్రెయిన్ వెంబడి ఉన్న ఖాళీస్థలాలను అడ్డాగా చేసుకుని ఆకతాయిలు మద్యం, గంజాయి వంటి తాగుతూ స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఖాళీ స్థలాల పక్కనే ఉన్న భవన యజమానులు ఇళ్లలో వాడిన చెత్త, వ్యర్థాలతో పాటు భవన నిర్మాణాలు, మరమ్మతులు చేసిన మట్టి, వ్యర్థాలను ఇక్కడే పడేస్తున్నారు. ఖాళీ స్థలాలను పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని స్థల యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నా కార్పొరేషన్ సిబ్బందికి తలనొప్పిగా మారింది. అసలు స్థల యజమానులు ఎక్కడ ఉన్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుని ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి ఆస్థలాల్లోని ముళ్లపొదలు, చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘ క్యాలెండర్ ఆవిష్కరణ



వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగుల సంఘ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రశాంత్‌కుమార్

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖ గెజిటెడ్ అండ్ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం 2025 క్యాలెండర్‌ను గురువారం ఆ శాఖ విజయవాడ నోడల్ డివిజన్ జాయింట్ కమిషనర్ ప్రశాంత్‌కుమార్ ఆవిష్కరించారు. అనంతరం ఉద్యోగుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగుల సమస్యలు తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అందరూ కష్టపడి పనిచేసి వాణిజ్య పన్నుల శాఖకు మంచిపేరు తీసుకురావాలన్నారు. తప్పుచేస్తే ఉపేక్షించేది లేదని, అవినీతికి తావులేకుండా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వట్టిపల్లి రామస్వామి, గౌరవ అధ్యక్షుడు మురికిపూడి వెంకటేశ్వరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ కెవీఎల్ఎస్‌వి ప్రసాద్, రాష్ట్ర కోశాధికారి సీహెచ్ సువర్ణరాజు, ఉపాధ్యక్షుడు సాయికిరణ్, డి వెంకటేష్, లక్ష్మయ్య, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ కాలనీలో అగ్నిప్రమాదం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అగ్నిప్రమాదం జరిగి రూ. 30వేలు విలువైన ఏసీ, డబుల్‌కాట్ మంచం, టీవీ కాలి బూడిద అయ్యాయంటూ గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీజీకాలనీకు చెందిన కె. విజయ ఖమ్మంలోని తన తల్లికి అనారోగ్యంగా ఉండటంతో చూసేందుకు ఈ నెల 21వ తేదీన వెళ్లారు. 22వ తేదీన విజయ ఇంట్లో మంటలు వస్తున్నాయంటూ ఇంటి పక్కవారు ఫోన్ చేశారు. దీంతో విజయ అక్క కుమారుడు ఎం.ఉపేంద్ర ఘటనాస్థలానికి చేరుకున్నారు. అప్పటికే మంటలు పెరుగుతుండటంతో ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. ఇంట్లో ఎవరూలేని సమయంలో అగ్ని ప్రమాదం జరగటం అనుమానాలకు తావిచ్చే విధంగా ఉందని స్థానికులు అంటున్నారు ఉపేంద్ర ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒకటి నుంచి బ్యూటీషియన్, టైలరింగ్‌లో శిక్షణ ప్రారంభం

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేట, రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి బ్యూటీషియన్, టైలరింగ్‌లో కొత్త బ్యాచ్‌లకు శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామని ఎం.బి. విజ్ఞాన కేంద్రం మహిళా విభాగం ఇన్‌చార్జి పి.విజయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా శిక్షణ విభాగం ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక బ్యాచ్‌లకు టైలరింగ్, బ్యూటీషియన్, ఎంబ్రాయిడరీ, పెయింటింగ్, మిషన్ ఎంబ్రాయిడరిలలో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశామన్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే బ్యూటీషియన్, టైలరింగ్ శిక్షణలు ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయన్నారు. బ్యూటీషియన్ మూడు నెలలు, టైలరింగ్ నాలుగు నెలల పాటు జరిగే ఈ శిక్షణలకు ఆసక్తి గలవారు ఈ నెల 30వ తేదీ లోపు ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 73821 93413, 94900 98021 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డెక్కిన మురుగు నీరు



కనకదుర్గ ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డు పైకి చేరిన మురుగునీరు



పశ్చిమ తహసీల్దార్ ఆఫీస్ ముందు చేరిన మురుగునీరు



ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లో చేపట్టిన డ్రెయిన్ నిర్మాణ పనులు



తహసీల్దార్ ఆఫీస్ ముందున్న డ్రెయిన్‌కు వేసిన అడ్డుకట్ట

భవానీపురం(విజయవాడపశ్చిమ): అధికారుల అనాలోచిత నిర్ణయాల కారణంగా ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది. అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణ పనులకు ఆటంకంగా ఉందన్న కారణంతో డ్రెయిన్‌లో పారుతున్న మురుగునీటికి అడ్డుకట్ట వేశారు. దీంతో అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లో పారుదలయ్యే మురుగునీరు పొంగిపొర్లి రోడ్ మీదకు వచ్చి చేరుతుండటంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. భవానీపురం లారీ స్టాండ్ వద్ద నుంచి ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్ ద్వారా ప్రవహించే మురుగునీరు తహసీల్దార్ కార్యాలయం చివర మలుపు వద్దకు చేరుకుంటాయి. అక్కడ నుంచి ఉన్న కచ్చాడ్రెయిన్ ద్వారా ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లో నుంచి ముందుకు సాగుతుంది. ఈ క్రమంలో ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్‌లో అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణ పనులు చేపట్టిన కార్పొరేషన్ అధికారులు, పనులకు ఆటంకం కలుగుతుందనే కారణంగా తహసీల్దార్ ఆఫీస్ ముందున్న డ్రెయిన్ చివరిలో మురుగునీటి పారుదలకు ఎర్రమట్టితో అడ్డుకట్ట వేశారు. తద్వారా కూడా డ్రెయిన్ నిండిపోయి పొంగిపొర్లి మురుగంతా రోడ్డు మీదకు చేరుతోంది. భవానీపురం లారీస్టాండ్‌లోగల వాటర్‌ట్యాంక్ నుంచి వదిలే నీరు కనకదుర్గ ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్‌లోని అవుట్‌ఫాల్ డ్రెయిన్స్‌లోకి చేరుతుండటంతో అవి నిండి మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. తహసిల్దార్ ఆఫీస్ ముందున్న డ్రెయిన్ నుంచి కొత్త డ్రెయిన్ నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉండగా అక్కడ మూసేసి ఎక్కడ నుంచో మొదలు పెట్టడమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారుల అనాలోచిత పనుల మురుగంతా రోడ్ మీదకు చేరి దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రాణాలకు భద్రత



మాట్లాడుతున్న డీసీపీ కృష్ణమూర్తినాయుడు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): హెల్మెట్ ధరించడంతోపాటు ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాల బారినుంచి తప్పించుకోవచ్చని ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీ ఆవరణలో ట్రాఫిక్ నిబంధనలపై వన్‌టౌన్ ట్రాఫిక్ పోలీసులు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణమూర్తినాయుడు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక మరణాలు హెల్మెట్ ధరించకపోయినందునే చోటుచేసుకుంటున్నాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయన్నారు. విద్యార్థులు ద్విచక్ర వాహనాలను నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. కేవలం విద్యార్థులే కాకుండా వారి కుటుంబసభ్యులలో సైతం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచాలని కోరారు. కుటుంబంలో ఒక వ్యక్తి మరణిస్తే వారి పరిస్థితి ఏమిటనే అంశాలను వివరిస్తూ ట్రాఫిక్ నిబంధనల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ రామచంద్రరావు, సీఐ ఉమామహేశ్వరరావు, అధికారులు శ్రీధర్, ఆంజనేయులు, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లను సత్కరించిన ట్రాఫిక్ పోలీసులు



ఆటోడ్రైవర్‌ను సత్కరిస్తున్న ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రసన్నకుమార్, సీఐ కిషోర్‌బాబు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): త్రీ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం జింఖానా గ్రౌండ్‌లో రోడ్డుభద్రతపై ఆట డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ట్రాఫిక్ అదనపు డీసీపీ ఏవీఎల్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నింబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. రాంగ్ పార్కింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడితే చర్యలు తప్పవన్నారు. త్రీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌బాబు మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటిస్తామంటూ ఆటోడ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మంచి డ్రైవింగ్ లక్షణాలు, క్రమశిక్షణ కలిగిన ఆటోడ్రైవర్లను దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. యూనిఫాం, ప్రశంసా పత్రాలను అందజేసి వారిని అభినందించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ రంగయ్య, సిబ్బంది ఆజాద్, రాజేష్, వెంకట్, నరేంద్ర, ప్రవీణ్ పాల్గొన్నారు.

బోరు పంపులకు మరమ్మతులు చేయరూ!





కేఎల్‌రావునగర్‌లోని స్విమ్మింగ్ పూల్, కోళ్లఫారం వద్ద ఉన్న పనిచేయని బోరుపంపులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కేఎల్‌రావునగర్‌లోని కోళ్లఫారం, కేఎల్‌రావు స్విమ్మింగ్ పూల్ వద్ద ఉన్న బోర్లుపంపులు మరమ్మతులకు గురైన నిరుపయోగంగా మారాయి. ఆయా బోర్లు పనిచేయకపోతుండటంతో నీటికోసం స్థానికులు అవస్థలుపడుతున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి 46,47, 48వ డివిజన్‌లో పనిచేయని బోరుపంపులకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

26న హిందూ హైస్కూల్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న మాజీ కార్పొరేటర్లు రాంబాబు, ఆవాల మారుతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేటలోని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్‌లో 1974–75 సంవత్సరం పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఈనెల 26వ తేదీన నిర్వహించనున్నట్లు సమ్మేళనం కన్వీనర్ చందోలు ఆంజనేయులు, కోకన్వీనర్ గోకవరపు మురళీకృష్ణ తెలిపారు. పాతబస్తీలోని ఆ సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో పూర్వ విద్యార్థుల సంఘ నేతలు, మాజీ కార్పొరేటర్లు సంపర రాంబాబు, ఆవాల మారుతి సమ్మేళనం ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన నగరానికి సమీపంలో ఉన్న హాయ్‌లాండ్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.1974–75బ్యాచ్ విద్యార్థులంతా తప్పకుండా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

సుధా మధురం గాన సమ్మోహనం



కచేరీ నిర్వహిస్తున్న మోదుమూడి సుధాకర్

విజయవాడ కల్చరల్: హంసధ్వని చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో పటమట దత్తపీఠంలోని మరకత రాజ రాజేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి ఆరాధనా సంగీత ఉత్సవాలు గురువారం ముగిసాయి. రాంపల్లి గోపీ కృష్ణ త్యాగరాజ స్వామి సంగీత సాహిత్యంలో భక్తి అంశంగా ప్రసంగించారు. చివరిగా టాప్ గ్రేడ్ సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి మధురంగా సాగింది. నాదం శంకరం, భోఖిల్లు సప్తస్వర, త్యాగరాజ స్వామి రచించిన పలు కీర్తనలు మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై బీవీ దుర్గాభవాని, ఘటంపై హరిబాబు, మృదంగంపై ఎన్ఎస్ కల్యాణరామన్ సహకరించారు. హంసధ్వని చారిటబుల్ సంస్థ వ్యవస్థాపక సంఘం సభ్యుడు యనమండ్ర శ్రీనివాస శాస్త్రి, కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రామశాస్త్రి, గోపీ కృష్ణశర్మ, కీర్తి చంద్ర, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంటు ఏర్పాటుకు చర్యలు

పాయకాపురం(విజయవాడరూరల్): హైదరాబాద్‌కు చెందిన యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ అనే ఎన్జీఓ సంస్థ పాయకాపురం ప్రాంతంలోని ప్రజలకు ఉచితంగా తాగునీరు సరఫరా చేసేందుకు ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేస్తోంది. సెప్టెంబరు నెలలో సంభవించిన వరదల నేపథ్యంలో బోరులు పాడైపోయి నీరు కలుషితం కావడంతో ఆ ప్రాంత ప్రజల విజ్ఞప్తి మేరకు ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయడంలో భాగంగా రైతుబజారు ప్రాంగణంలో బోరు ఏర్పాటు చేశామని సంస్థ ప్రతినిధి కె.రాములు తెలిపారు. ప్రతి గంటకు వెయ్యి లీటర్ల తాగునీరు సరఫరా చేసే ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. వరదల్లో నిరాశ్రయులైన పేద కుటుంబాలకు కూడా తమ సంస్థ తరపున సహాయం అందచేస్తున్నామని ఆయన తెలియజేశారు.